‘ఉగ్ర’ లింకులపై అనుమానం

దేశవ్యాప్తంగా 15 చోట్ల ఎన్ఐఏ దాడులు

కోల్‌కతా, మే 31: ఉగ్రవాదులతో లింక్‌లు ఉన్నాయన్న అనుమానంతో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దేశంలోని ఏడు రాష్ట్రాల్లో 15 చోట్ల దాడులు నిర్వహించింది. ఢిల్లీ, హర్యానా, పశ్చిమ బెంగాల్, యూపీ, మహారాష్ట్ర, రాజస్థాన్, అస్సాం రాష్ట్రాల్లో ఈ దాడులు జరిపింది. పాకిస్థాన్ హ్యాండ్లర్లకు సున్నిత సమాచారం అందిస్తున్నారన్న ఆరోపణపై సీఆర్‌పీఎఫ్‌కు చెందిన ఒక వ్యక్తిని ఇటీవల అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో అనుమానిత నగదు లావాదేవీలు వెలుగులోకి రావడంతో కోల్‌కతాలో ఒక ట్రావెల్ కార్యాలయం సహా మూడు ప్రాంతాల్లో ఎన్ఐఏ దాడులు జరిపింది. కనీసం మూడు సార్లు ఈ ట్రావెల్ సంస్థ నుంచి అనుమానాస్పద నగదు బదిలీ లావాదేవీలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. దీంతో దాని యజమాని మహమ్మద్ మసూద్ అలమ్‌కు సమన్లు జారీ చేసి సోమవారం తమ ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పాకిస్థాన్ ఇంటెలిజెన్స్‌కు రహస్య సమాచారం అందించారన్న ఆరోపణతో ఢిల్లీకి చెందిన సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ మోతీరామ్ జత్‌ను అరెస్ట్ చేసిన క్రమంలో ఢిల్లీ, చండీగఢ్‌లలో ఎన్ఐఏ దాడులు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 15 ప్రదేశాల్లో దాడులు జరిగిన విషయాన్ని ఎన్ఐఏ అధికారులు శనివారం నిర్ధారించారు. దానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే అందజేస్తామని తెలిపారు.

చివరి వ్యక్తికీ అన్ని వ్యవస్థలు చేరువ కావాలి

సీజేఐ జస్టిస్ గవాయ్

న్యూఢిల్లీ: న్యాయం కోరే చిట్టచివరి వరుసలో ఉన్న వ్యక్తికి సైతం చేరువ కావడం మన ప్రాథమిక కర్తవ్యమని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ చెప్పారు. చట్ట సభలు, కార్యనిర్వాహక శాఖ, న్యాయ వ్యవస్థ.. ఇవన్నీ ఆ వ్యక్తికి చేరువ కావాలన్నారు. అలహాబాద్ హైకోర్టు ప్రాంగణంలో మల్టీ లెవెల్ పార్కింగ్, అడ్వకేట్ చాంబర్స్‌ను శనివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ‘‘రాజ్యాంగాన్ని రచించి, తుది ముసాయిదాను రాజ్యాంగ సభకు సమర్పించినపుడు, కొందరు ఇది అతి సమాఖ్యతత్వంతో కూడినదని, మరికొందరు అతి ఏక ధృవ వైఖరితో ఉందని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ బదులిస్తూ, ‘ఈ రాజ్యాంగం పూర్తిగా సమాఖ్యతత్వంతో కూడినది కాదు, ఏక ధృవ వైఖరి కలిగినది కాదు’ అని అన్నారు.

వాయుసేనకు నష్టం నిజమే!

మొదటిపేజీ తరువాయి...

ప్రదర్శించాయని ఆయన తెలిపారు. ‘ఇందులో మంచి విషయం ఏమిటంటే మేము చేసిన వ్యూహాత్మక తప్పిదాలను త్వరగా తెలుసుకుని సరిదిద్దుకుని రెండు రోజుల తర్వాత మరోసారి అమలు చేశాం. సుదూర లక్ష్యాలపై మరోసారి మా నాలుగు యుద్ధ విమానాలు దాడులు చేశాయి’ అని ఆయన తెలిపారు.

• మోదీ సభ అట్టర్ ఫ్లాప్!

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్‌లోని ఔరంగాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన ఒక బహిరంగ సభ ప్రధాని మోదీకి షాకిచ్చింది. నిర్వాహకులు సభా ప్రాంగణంలో 30 వేల కుర్చీలు వేయగా, సభకు పట్టుమని 400 మంది లోపే హాజరయ్యారు. ఖాళీ కుర్చీలను చూసి విస్తుపోయిన మోదీ సభ రద్దు చేస్తే పరువుపోతుందని భావించారో ఏమో.. ఖాళీ కుర్చీలను ఉద్దేశించే ప్రసంగించి బతుకుజీవుడా అంటూ వెనుదిరిగారు!

3 వేలు దాటిన యాక్టివ్ కేసులు

24 గంటల్లో 7 మంది కరోనాతో మృతి • కేరళలో అత్యధికంగా 1,336 మంది బాధితులు

న్యూఢిల్లీ, మే 31: కరోనా వైరస్ మళ్లీ కొన్ని రోజులుగా దేశంలో విజృంభిస్తోంది. దీంతో కొవిడ్-19 యాక్టివ్ కేసులు 3395కు చేరుకున్నాయి. కేరళలో అత్యధికంగా కొవిడ్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శనివారం వెల్లడించింది. కేరళలో 1336 యాక్టివ్ కేసులతో మొదటి స్థానంలో ఉండగా, మహారాష్ట్ర(467), ఢిల్లీ(375), గుజరాత్(265), కర్ణాటక(234), పశ్చిమ బెంగాల్ (205), తమిళనాడు (185),యూపీ(117) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 116 యాక్టివ్ కేసులు ఉన్నాయి. శుక్రవారం నుంచి శనివారం వరకు ఏడు మరణాలు చోటుచేసుకున్నట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుత వేవ్‌లో ఢిల్లీలో మొదటి కొవిడ్ మరణం నమోదైంది. అయితే చాలా కొవిడ్ కేసులు స్వల్ప తీవ్రతతో ఉన్నాయని, భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య శాఖ తెలిపింది. నిజానికి, కేరళలో కరోనా నిర్ధారణ పరీక్షలు అధికంగా నిర్వహిస్తున్న కారణంగానే అత్యధిక కేసులు నమోదవుతున్నాయి. మిజోరంలో ఏడు నెలల తర్వాత మొదటి కొవిడ్ కేసు నమోదైంది.

కొత్త వేరియంట్లే కారణం

కొవిడ్ కేసులు దేశంలో హఠాత్తుగా పెరగడానికి రెండు కొత్త ఒమిక్రాన్ సబ్-వేరియంట్లు ఎల్ఎఫ్7, ఎన్‌బీ.1.8.1 కారణంగా తెలుస్తోంది. కాగా, జేఎన్.1 వేరియంట్ ప్రభావం మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే ఎల్ఎఫ్.7 లేక ఎన్‌బీ.1.8ని వేరియంట్స్ ఆఫ్ కన్సర్న్(వీఓసీ) లేక వేరియంట్స్ ఆఫ్ ఇంటెరెస్ట్(వీఓఐ)గా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) ఇప్పటి వరకు ప్రకటించలేదు. కొత్త వేరియంట్లుకు రోగ నిరోధక శక్తిని జయించే సామర్థ్యం కొంత ఉండే అవకాశం ఉన్నప్పటికీ దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్‌ను అవి కలిగించవచ్చని చెప్పడానికి ఆధారాలేవీ లేవని నిపుణులు తెలిపారు.

చుట్టూ గూఢచారులే!

మొదటిపేజీ తరువాయి...

విక్రయించే వ్యక్తి ఇలా పలు రంగాలకు చెందిన వ్యక్తులు పాక్‌కు గూఢచారులుగా వ్యవహరించినట్టు అధికారులు పేర్కొన్నారు. డబ్బులకు ఆశపడి కొందరు, హనీట్రాప్‌లో పడి మరికొందరు.. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు చేరవేసినట్టు వారు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి ముందు నుంచే ఈ గూఢచర్యం కొనసాగుతున్నదని, దాన్ని గుర్తించడంలో కేంద్రం వైఫల్యం చెందిందని నిపుణులు విమర్శిస్తున్నారు. భద్రతాపరమైన లోపాలు చోటుచేసుకొన్న మాట వాస్తవమేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే ఒప్పుకున్నారు.

శనివారం పటియాలాలో గూఢచర్యం కేసులో అరెస్టయిన హసీన్

అరెస్టయిన గూఢచారులు వీళ్లే

- జ్యోతిమల్హోత్రా (యూట్యూబర్): పాక్‌లో ఇంటెలిజెన్స్ అధికారులను కలిశారు. ఉగ్రదాడికి ముందు పహల్గాంలోనూ పర్యటించారు. ఉగ్రదాడి తర్వాత పాక్ హైకమిషన్ వద్ద కేక్ డెలివరీ చేసిన వ్యక్తితోనూ ముచ్చట్లు పెట్టారు. 12 టెరాబైట్ల డేటా పాక్‌కు చేర్చినట్టు అనుమానిస్తున్నారు.
- మోతీరామ్ జాట్ (సీఆర్‌పీఎఫ్ జవాన్): డబ్బులు తీసుకొని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్స్ (పీఐవో)కు 2023 నుంచే కీలక సమాచారాన్ని చేరవేస్తున్నాడు.
- రవీంద్ర వర్మ (మెకానికల్ ఇంజినీర్): ముంబైలోని ఓ రక్షణ రంగ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2024 నుంచి భారత్‌కు చెందిన యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్ల సమాచారాన్ని స్కెచ్‌ల రూపంలో పాక్‌కు చేరవేశాడు.
- సహదేవ్‌సింగ్ (హెల్త్ వర్కర్): ఐఏఎఫ్, బీఎస్ఎఫ్ ఇన్‌ఫ్రాకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాక్‌కు చేరవేశాడు. 2023 నుంచే ఈ కార్యకలాపాలు సాగుతున్నాయి.
- దేవేందర్ సింగ్ (పీజీ స్టూడెంట్): 2024 నవంబర్‌లో పాక్‌లో పర్యటించాడు. అప్పుడే భారత సైన్యానికి సంబంధించిన కొన్ని ఫొటోలను పాక్‌కు చేరవేశాడు.
- నౌమన్ (సెక్యూరిటీ గార్డు): హర్యానా సరిహద్దుల్లోని భద్రతాదళాలకు సంబంధించిన సమాచారాన్ని పాక్‌కు చేరవేశాడు. ఐఎస్ఐకి మన సైన్యం కదలికలను ఎప్పటికప్పుడు తెలియచేశాడు. ఆర్మన్, తారిఫ్ అనే మరో ఇద్దరు కూడా ఇదే కేసులో అరెస్టయ్యారు.
- షాకూర్ ఖాన్ (ప్రభుత్వాధికారి): ఏడు సార్లు అనధికారికంగా పాక్‌లో పర్యటించాడు. మెయిల్, వాట్సాప్‌లో కొన్ని ఫైల్స్‌ను డిలీట్ చేశాడు. పాక్ నుంచి కొంత మొత్తంలో డబ్బులు ఈయన ఖాతాకు బదిలీ అయ్యాయి.
- కాసీమ్ (సిమ్‌కార్డుల విక్రయదారి): ఇండియన్ మొబైల్ సిమ్‌కార్డులను పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్స్ (పీఐవో)కు విక్రయించాడు. ఐఎస్ఐకి కీలక సమాచారమిచ్చాడు.
- షాహ్‌జాద్ (బిజినెస్‌మ్యాన్): పాక్‌లో పలుమార్లు పర్యటించాడు. అక్రమంగా సరుకును రవాణా చేశాడు. సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు చేరవేశాడు.
- ముర్తాజా అలీ (టెకీ): మన దళాలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని ఐఎస్ఐకి పంపించడానికి ఏకంగా ప్రత్యేకమైన యాప్‌ను తయారు చేశాడు.

వీళ్లేకాకుండా యూపీలోని ఓ మసీదు ఇమామ్‌ను, పంజాబ్‌కు చెందిన గజాలా, యామిన్‌ను కూడా గూఢచర్యం కేసులో పోలీసులు అరెస్టు చేశారు.

గూఢచారి ఇంజినీర్ అరెస్ట్

ముంబై: రక్షణ సాంకేతిక సంస్థలో జూనియర్ ఇంజినీరుగా పని చేస్తున్న రవీంద్ర వర్మ (27)ను మహారాష్ట్ర పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఆయన పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. కోర్టు ఆయనను యాంటీ టెర్రరిజం స్క్వాడ్ కస్టడీకి అప్పగించింది. పోలీసుల కథనం ప్రకారం, థానేలోని కల్యాణికి చెందిన రవీంద్ర వర్మకు 2024లో ఫేస్‌బుక్ ద్వారా పాకిస్థాన్ ఏజెంట్లు పాయల్ శర్మ, ఇస్ప్రీత్‌లతో పరిచయమైంది. వారిద్దరూ తాము భారత్‌కు చెందినవారమని పరిచయం చేసుకున్నారు. ఓ ప్రాజెక్టు కోసం యుద్ధ నౌకల సమాచారం కావాలని వర్మను కోరారు. వర్మ వారి వలపు వలలో చిక్కుకున్నాడు. దక్షిణ ముంబైలోని నావల్ డాక్ యార్డుకు వెళ్లేందుకు, నౌకాదళ యుద్ధ నౌకలు, జలాంతర్గాముల్లో ప్రయాణించేందుకు ఆయనకు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని ఆయన దుర్వినియోగం చేసి, యుద్ధ నౌకలతోపాటు జలాంతర్గాములకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఆ పాక్ ఏజెంట్లకు చేరవేశాడు. అందుకు బదులుగా వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు పొందాడు.

ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధాని స్పందించరా?



భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తానే తగ్గించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదే పదే చేస్తున్న వ్యాఖ్యలపై ప్రధాని మోదీ స్పందించరా? 21 రోజుల్లో ట్రంప్ ఇలా ప్రకటించడం ఇది 11వ సారి. చివరికి కోర్టుల్లోనూ అదే వాదన. కానీ ట్రంప్ ప్రకటనలపై ప్రధాని మోదీ పూర్తిగా మౌనం వహిస్తున్నారు. ఆయన ఎందుకు మాట్లాడటం లేదు?’

– జైరాం రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నేత

సైన్యాన్ని సంప్రదించకుండా కాల్పుల విరమణ!



త్రివిధ దళాలను సంప్రదించకుండానే కేంద్రం పాక్‌తో కాల్పుల విరమణను ప్రకటించింది. దీని గురించి మూడో దేశం (అమెరికా) సోషల్ మీడియా ద్వారా ప్రకటించటం షాక్‌కు గురి చేసింది.

– సుఖ్వీందర్ సుఖు, హిమాచల్ ప్రదేశ్ సీఎం

వార్తల్లో నిలిచేందుకే

ఇప్పుడు ట్రంప్ కొడుకు బారన్‌కే కాదు, గతంలో డొనాల్డ్ ట్రంప్‌నకు కూడా హార్వర్డ్ అడ్మిషన్ ఇవ్వలేనట్టుంది. అందుకే ట్రంప్ ఈ విధంగా ప్రవర్తిస్తున్నారు. ఎప్పుడూ వార్తల్లో నిలిచేందుకు ప్రఖ్యాత సంస్థలు, వ్యక్తులను టార్గెట్ చేసుకొని వాటిపై ఆధిపత్యం చెలాయించాలని ఆయన చూస్తారు.

– మైకేల్ వోల్ఫ్, ప్రముఖ రచయిత

రక్షణ వ్యవస్థల పరీక్షలు ముమ్మరం

కృత్రిమ, నియంత్రిత పరిస్థితుల్లో సైన్యం ప్రయోగాలు

న్యూఢిల్లీ : భారత సైన్యం దేశవ్యాప్తంగా పలు కీలక ప్రదేశాల్లో దేశీయంగా అభివృద్ధి చేసిన నవతరం రక్షణ వ్యవస్థలను పరీక్షిస్తున్నది. జోషీమఠ్, పోఖ్రాన్, బబినా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లలో కూడా ఇటువంటి సామర్థ్య అభివృద్ధి ప్రదర్శనలను నిర్వహిస్తున్నది. ప్రత్యేకంగా ఆగ్రా, గోపాల్‌పూర్‌లలో గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించబోతున్నది. ఈ పరీక్షలన్నీ కృత్రిమంగా సృష్టించిన నియంత్రిత పరిస్థితుల్లో, సమన్వయపరచిన ఎల్రక్టానిక్ యుద్ధ వాతావరణంలో జరుగుతున్నాయి. అత్యాధునిక రక్షణ వ్యవస్థల పనితీరును మదింపు చేయడమే వీటి లక్ష్యం. మానవ రహిత గగనతల వ్యవస్థలు (యూఏఎస్), యూఏవీ లాంచ్‌డ్ ప్రెసిషన్ గైడెడ్ మ్యునిషన్, రన్‌వే ఇండిపెండెంట్ రిమోట్‌లీ పైలటెడ్ ఏరియల్ సిస్టమ్స్, కౌంటర్ యూఏఎస్ సొల్యూషన్స్, లోయిటరింగ్ మ్యునిషన్స్, స్పెషలైజ్డ్ వెర్టికల్ లాంచ్ డ్రోన్స్, ప్రెసిషన్ మల్టీ మ్యునిషన్ డెలివరీ సిస్టమ్స్ తదితర రక్షణ వ్యవస్థలను పరీక్షించి, వాటి సామర్థ్యాన్ని మదింపు చేస్తున్నారు. భవిష్యత్తులో యుద్ధాలు జరిగితే, సమర్థంగా ఎదుర్కొనడానికి భారత సైన్యం సాంకేతిక పరిజ్ఞానంలో ఆధిపత్య స్థాయిలో ఉండటంతోపాటు ఆపరేషనల్‌గా సిద్ధంగా ఉండాలనేది ఈ పరీక్షల లక్ష్యం.

ఆకస్మిక వరదలకు 30 మంది మృతి

గువాహతి: ఎడతెరపి లేకుండా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాలలో కొండ చరియలు విరిగిపడిన ఘటనలు, ఆకస్మిక వరదలకు 30 మంది మరణించారు. గడచిన 24 గంటల్లో 14 మంది మరణించారు. అస్సాంలోని 12 జిల్లాల్లో దాదాపు 60,000 మంది వరద తాకిడికి బాధితులయ్యారు. అస్సాంలో ఆకస్మిక వరదలకు ఐదుగురు మరణించగా, అరుణాచల్ ప్రదేశ్‌లో కొండ చరియలు విరిగిపడి 9 మంది మరణించారు. అరుణాల ప్రదేశ్‌లోని తూర్పు కమెంగ్‌జిల్లాలో కొండ చరియలు విరిగిపడడంతో ఓ కారు రోడ్డుపై నుంచి కొట్టుకుపోవడంతో రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు మరణించారు. ఈశాన్య భారతంలోని పలు రాష్ట్రాలకు వాతావరణ శాఖ ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

సిక్కింలో చిక్కుకుపోయిన 500 మంది పర్యాటకులు

భారీ వర్షాలకు రహదారులపై కొండచరియలు విరిగిపడడంతో సిక్కింలోని వివిధ ప్రాంతాలలో దాదాపు 500 మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. గల్లంతైన 8 మంది పర్యాటకుల కోసం జరుగుతున్న గాలింపు చర్యలకు వర్షం వల్ల ఆటంకం ఏర్పడింది.

ఏఐ సాయంతో రైలు టికెట్ బుకింగ్

‘ఆస్క్ దిశ 2.0’ను పరిచయం చేసిన ఐఆర్‌సీటీసీ



న్యూఢిల్లీ: రైలు టికెట్ల బుకింగ్, రద్దు విషయంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) చెక్ పెట్టింది. ఇందుకోసం ‘ఆస్క్ దిశ 2.0’ అనే ఏఐ ఆధారిత వర్చువల్ అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టింది. యాప్‌తోపాటు వెబ్‌సైట్‌లోనూ ఈ చాట్‌బాట్ అందుబాటులో ఉంది. యూజర్ ఫ్రెండ్లీ అనుభవాన్ని అందించేందుకు తీసుకొచ్చిన ఈ ఫీచర్ ద్వారా టికెట్ బుకింగ్, రద్దు, రిఫండ్ స్టేటస్‌తో పాటు ప్రయాణానికి సంబంధించిన అన్ని వివరాలను ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ సహ పలు భాషల్లో అందుబాటులో ఉన్న వాయిస్ కమాండ్ ఆధారంగా సేవలను వినియోగించుకోవచ్చు. సాంకేతికత మీద అనుభవం లేని, టెక్ట్స్‌ను టైప్ చేయలేని వారికి ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ఐఆర్‌సీటీసీ పాస్‌వర్డ్‌ను గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఓటీపీ ఆధారంగా టికెట్లను బుక్ చేసుకోవచ్చు. ట్రాన్సాక్షన్ ఫెయిలైనా, టికెట్లు క్యాన్సిల్ చేసినా రిఫండ్ కోసం ఎక్కువ రోజులు ఎదురుచూడాల్సిన అవసరం లేదు.

బీఎస్ఎఫ్ అధికారిణికి ఆర్మీ చీఫ్ ప్రశంస

ఆపరేషన్ సిందూర్‌లో ధైర్య సాహసాలకు అభినందన

జమ్మూ, మే 31: ఆపరేషన్ సిందూర్ సందర్భంగా అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ నేహా భండారీని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అభినందించారు. ఈ మేరకు శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు ప్రశంసా పత్రం అందజేశారు. సరిహద్దులోని పర్గ్వాల్ ఔట్‌పోస్ట్‌ను కమాండ్ చేస్తూ అత్యంత సమీపంలోని పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌లను ఆమె విజయవంతంగా నిలువరించారని ద్వివేది పేర్కొన్నారు. సాంబ, ఆర్ఎస్‌పురా, అఖ్నూర్ సెక్టార్‌లలోని శత్రు శిబిరాలపై నిర్వహించిన ఆపరేషన్‌లో తన ఆధ్వర్యంలోని సైనిక బలగాలను దిశా నిర్దేశం చేయడంలో నేహా విజయం సాధించారని కొనియాడారు. నేహాతో పాటు మరో ఆరుగురు కానిస్టేబుళ్లను ఆర్మీ చీఫ్ సత్కరించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన నేహా తల్లిదండ్రులు సీఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

భారత్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు

- **ఆపరేషన్ కగార్, నక్సలైట్ల మృతికి సంతాపంగా నిర్ణయం**
- **జూన్ 10న బంద్, ఆగస్టు 3 వరకు స్మారక సభలకు పిలుపు**

హైదరాబాద్, మే 31 (నమస్తే తెలంగాణ): మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మృతి, ఆపరేషన్ కగార్‌ను నిరసిస్తూ ఆ పార్టీ ఈ నెల 10న దేశవ్యాప్తంగా బంద్ పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. ఈ నెల 11 నుంచి ఆగస్టు 3 వరకు స్మారక సభలు నిర్వహించాలని తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది మావోయిస్టులు మరణించిన మే 21ను విప్లవ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించింది. హైదరాబాద్‌లో మార్చిలో హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ నాయకత్వంలో శాంతి చర్చల కమిటీ ఏర్పడిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలు జరపాలని సూచించిందని గుర్తు చేసింది. శాంతి చర్చలకు సిద్ధమేనని తమ పార్టీ కూడా మార్చి 28న పత్రికా ప్రకటన ద్వారా అభిప్రాయం తెలిపిందని పేర్కొంది. ఆ తర్వాత రెండుసార్లు మావోయిస్టు పార్టీ మీడియా కమిటీ ప్రతినిధులు శాంతి చర్చలకు సానుకూల పరిస్థితిని కల్పించాలని కోరినట్టు తెలిపింది. ఆ ప్రకటనలను ఏమాత్రం లెక్కచేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తూ.. ఏప్రిల్ నుంచి దాదాపు 85 మందిని హత్య చేసిందని ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేసింది. నిరుడు జనవరి నుంచి ఈ ఏడాది మే వరకు దాదాపు 540 మంది మావోయిస్టులను, ‘జల్ జంగల్ జమీన్’ కోసం పోరాడుతున్న సాధారణ ప్రజలను హత్య చేశారని మండిపడింది. పార్టీ ప్రధాన కార్యదర్శిని కోల్పోవడం పార్టీకి భారీ నష్టమేనని, ఈ నష్టం శాశ్వతం కాదని తెలిపింది.

ఛత్తీస్‌గఢ్‌లో ముగ్గురు నక్సలైట్ల అరెస్ట్

సుక్మా, మే 31: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో ముగ్గురు నక్సలైట్లను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి ముగ్గురిపై రూ.21 లక్షల రివార్డు ఉన్నట్టు శనివారం తెలిపారు. అరెస్టయిన వారిని దోడి పోడియా (36), దోడి పండు (18), దోడి నందు (28) లుగా గుర్తించారు. జగర్‌గుండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వారి స్వగ్రామం గొండ్‌పల్లిలో సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో వీరిని అరెస్ట్ చేశారు. వీరిపై స్థానిక శిక్షదూత్ (తాత్కాలిక టీచర్) హత్యతో పాటు పలు నేరాల అభియోగాలు ఉన్నాయి. వీరిలో పోడియా మావోయిస్టుల ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యుడు కాగా, పాండు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ సభ్యుడు. వీరిద్దరిపై తలా రూ. 8 లక్షలు, నందుపై 5 లక్షల రివార్డు ఉంది.

సరిహద్దు రాష్ట్రాల్లో సెక్యూరిటీ డ్రిల్స్

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణ జరిగిన తర్వాత అత్యవసర పరిస్థితులలో పౌర సంసిద్ధతను పరీక్షించేందుకు దేశవ్యాప్తంగా శనివారం ఆపరేషన్ షీల్డ్ చేపట్టారు. ఇందులో భాగంగా పాక్ సరిహద్దు వెంబడి ఉన్న రాష్ట్రాలలో శనివారం సివిల్ డిఫెన్స్ డ్రిల్స్ జరిగాయి. జమ్ము కశ్మీర్, గుజరాత్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ఈ డ్రిల్స్ జరిగాయి. విద్యుత్తు సరఫరాను నిలిపివేసి బ్లాక్ అవుట్ చేయడం, గాయపడిన వారిని తరలించడం, అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణం స్పందించడం వంటివి ఈ డ్రిల్స్‌లో ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి ముందు మే 7న దేశవ్యాప్తంగా మొదటిసారి మాక్ డ్రిల్స్ జరిగాయి. దానికి కొనసాగింపుగానే తాజా డ్రిల్స్ జరిగాయి.

పులుల సంరక్షకుడు థాపర్ కన్నుమూత

వన్యప్రాణుల సంరక్షణకు జీవితం అంకితం



న్యూఢిల్లీ, మే 31: వన్యప్రాణి సంరక్షకుడు, రచయిత వాల్మీక్ థాపర్(73) శనివారం ఉదయం న్యూఢిల్లీలోని తన నివాసంలో కన్నుమూశారు. థాపర్ తన జీవితాన్ని వన్యప్రాణుల అధ్యయనానికి, ముఖ్యంగా రాజస్థాన్‌లోని రంథంబోర్ నేషనల్ పార్కులోని పులుల సంరక్షణకు అంకితం చేశారు. 1988లో రంథంబోర్ ఫౌండేషన్‌ను ఇతరులతోకలసి స్థాపించారు. ఈ ఎన్జీవో గ్రామీణ ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ వన్యప్రాణి సంరక్షణ చర్యలపై కృషి చేసింది. తన ఐదు దశాబ్దాల కెరీర్‌లో థాపర్ పులుల వేటకు వ్యతిరేకంగా కఠిన చట్టాలు తీసుకురావాలని, పులుల ఆవాసాలను పరిరక్షించాలని ప్రభుత్వాలపై గట్టి ఒత్తిడి తీసుకువచ్చారు. ప్రధాని అధ్యక్షతన ఉన్న జాతీయ వన్యప్రాణుల బోర్డుతో సహా 150కి పైగా ప్రభుత్వ కమిటీలు, టాస్క్ ఫోర్సులలో ఆయన సభ్యునిగా ఉన్నారు. ల్యాండ్ ఆఫ్ ది టైగర్: ఏ నేచురల్ హిస్టరీ ఆఫ్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్(1997), టైగర్ ఫైర్‌ఐ500 ఇయర్స్ ఆఫ్ ది టైగర్ ఇన్ ఇండియాతో సహా వన్య ప్రాణులపై ఆయన 30కి పైగా పుస్తకాలు రాశారు. బీబీసీ వంటి చానల్స్ కోసం ఆయన డాక్యుమెంటరీ నిర్మించారు.

ఇది ‘కిలో’ ఉల్లి గడ్డ!

ముంబై, మే 31 (నమస్తే తెలంగాణ) : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ భార్య కాంచన్ ధాపేవాడలో తమకు గల భక్తి ఫార్మ్‌లో దాదాపు కిలో బరువు ఉండే ఉల్లి గడ్డలను పండిస్తున్నారు. ఇందుకోసం నెదర్లాండ్స్ నుంచి విత్తనాలు తెప్పించి సహజసిద్ధ, సేంద్రియ ఎరువులను ఉపయోగించి డబుల్ డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో పండిస్తున్నారు. ఎకరా భూమిలో 12-13 టన్నుల ఉల్లిపాయల దిగుబడి వచ్చిందని నితిన్ గడ్కరీ వివరించారు.పంట కాలంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు.

‘క్లౌడ్ సక్’తో మబ్బుల్లో బందీ

- **చైనీయుడిని 28 వేల అడుగుల ఎత్తుకు లాక్కెళ్లిన మేఘాలు**
- **ఆక్సిజన్ పడిపోయినా చివరికి అతి కష్టంమీద భూమిపైకి**

న్యూఢిల్లీ: ఆకాశంలో ఆనందంగా విహరిస్తూ హఠాత్తుగా మేఘాల్లో చిక్కుకుపోతే ఎలా ఉంటుంది? అలాంటి విపత్కర పరిస్థితి ఓ చైనీస్ పారాగ్లైడర్‌కు వచ్చింది. అయితే పెంగ్ యుజియాంగ్ (55) అనేక ప్రతికూల పరిస్థితులను సాహసోపేతంగా తట్టుకుని, తిరిగి భూమిపైకి చేరుకోగలిగారు. ఆయన సెకండ్ హ్యాండ్ పారాగ్లైడింగ్ ఎక్విప్‌మెంట్‌ను పరీక్షించే సమయంలో హఠాత్తుగా ఆయనను మేఘాలు పీల్చేసుకున్నాయి. దాదాపు 3,000 మీటర్ల ఎత్తులో ఈ ‘క్లౌడ్ సక్’ ఎదురైంది. దీంతో ఆయన అత్యంత వేగంగా 8,598 మీటర్ల (సుమారు 28,000 అడుగుల) ఎత్తుకు దూసుకెళ్లిపోయారు. ఆయన శరీరమంతా మంచుతో కప్పబడి ఉన్నట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం వైరల్ అవుతున్నది. మంచు వల్ల ఒళ్లంతా తిమ్మిరి ఎక్కడం, ఆక్సిజన్ లెవెల్స్ ప్రమాదకర స్థాయికి పోయినా ఆయన నిరంతరం స్పృహలో ఉండేందుకు ప్రయత్నిస్తూ, కాంపాస్ సాయంతో నేలపైకి దిగగలిగారు. చిట్టచివరికి ఈశాన్య దిశలో కిందికి దిగడానికి ప్రయత్నించి, విజయం సాధించానని తెలిపారు.

క్లౌడ్ సక్ అంటే..

ఏవియేషన్ నిపుణుడు వాంగ్ యనన్ మాట్లాడుతూ, క్లౌడ్ సక్ (మేఘాలు పీల్చుకోవడం) అత్యంత అరుదుగా జరుగుతుందన్నారు. క్యుములోనింబస్ మేఘాల సమీపంలోని బలమైన గాలి తరంగాల్లోకి పారాగ్లైడర్లు వెళ్లినపుడు ఇది జరుగుతుందని తెలిపారు. హఠాత్తుగా సంభవించే ఈ పరిస్థితిని ముందుగా అంచనా వేయడం కష్టమని, చాలా తీవ్రంగా, ప్రమాదకరంగా ఉంటుందని చెప్పారు.

నైజీరియాలో వరదలు 151 మంది మృతి

మోక్వా, మే 31: నైజీరియా దేశం నైగర్ రాష్ట్రంలోని మోక్వా పట్టణంలో భారీ వరదలతో మరణించినవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. శనివారం నాటికి మృతుల సంఖ్య 151కి చేరినట్టు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం అకస్మాత్తుగా కుండపోత వర్షం కురువడంతో దాదాపు ఐదు గంటల్లోనే భారీ వరద పట్టణాన్ని ముంచెత్తిందని చెప్తున్నారు. నైగర్ రాష్ట్రంలో వాణిజ్యపరంగా మోక్వా కీలక ప్రాంతమని, ఇక్కడ భారీ ఎత్తున క్రయవిక్రయాలు జరుగుతుంటాయన్నారు. ముఖ్యంగా రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇక్కడికి వస్తుంటారని చెప్పారు. దీంతో నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. ఈ కారణంగానే మరణాల సంఖ్య భారీగా ఉన్నదని చెప్పారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నదన్నారు. వరదలతో 500 ఇండ్లు ధ్వంసం అయ్యాయని, 11 మంది గాయపడ్డారని, 3వేల మంది నిరాశ్రయులు అయ్యారన్నారు. పట్టణానికి రాకపోకలు సాగించే రెండు రోడ్లు, రెండు బ్రిడ్జీలు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు.

ఒప్పందాన్ని మీరే ఉల్లంఘించి మాపై నిందలా?

సింధూ జలాల ఒప్పందంపై పాక్ వైఖరిని ఎండగట్టిన భారత్

న్యూఢిల్లీ, మే 31: సింధూ జలాల ఒప్పందాన్ని ఉల్లంఘించిన పాకిస్థాన్ భారత్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందంటూ నిందించడం మానుకోవాలని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ డిమాండ్ చేశారు. తజికిస్థాన్‌లోని దుషంబేలో హిమానీ నదాలపై ఐక్య రాజ్య సమితి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ సింధూ జలాలపై పాక్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని విమర్శించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై అనేక దౌత్యపరమైన చర్యలు చేపట్టిన భారత ప్రభుత్వం సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేసింది. ఈ వేదికపై అసందర్భ అంశాలను పాక్ ప్రస్తావించడం తగదని ఆయన చెప్పారు. కాలంతోపాటే ఒప్పందం సారాంశం కూడా మారిపోయిందని ఆయన తెలిపారు. వాతావరణ మార్పులు, జనాభా ఒత్తిళ్లు, సీమాంతర ఉగ్రవాదం వంటి కొత్త పరిణామాలుగా ఆయన ఉదహరించారు. ఒప్పంద నిబంధనలు మళ్లీ అంచనా వేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. పరస్పర సహకారం, గౌరవం స్ఫూర్తిగా ఒప్పందం అమలు జరగాల్సి ఉందని, కాని పాకిస్థాన్ వైపు నుంచి తరచూ జరుగుతున్న సీమాంతర ఉగ్రవాదం ఈ ఒప్పందం స్ఫూర్తినే దెబ్బతీస్తోందని సింగ్ అన్నారు. ఒప్పందాన్ని తానే ఉల్లంఘిస్తూ పాక్ భారత్‌పై నింద వేస్తోందని ఆయన విమర్శించారు.

మీరు డ్రగ్స్ వినియోగించారా?!

డోజ్ వీడ్కోలు సభలో మస్క్‌కు మీడియా ప్రశ్న

వాషింగ్టన్, మే 31: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కొన్ని రకాల డ్రగ్స్ వినియోగిస్తున్నారంటూ ఓ అంతర్జాతీయ మీడియాలో వార్తా కథనం వెలువడింది. దీనిపై ఆయనను విలేకరులు తాజాగా ప్రశ్నించారు. వైట్‌హౌస్‌లో ఉన్నప్పుడు కూడా డ్రగ్స్ వినియోగించారా? అని ఒక విలేకరి అడిగితే, అవన్నీ తప్పుడు కథనాలుగా మస్క్ కొట్టిపారేశారు. ‘డోజ్ శాఖ’ నుంచి వైదొలిగిన నేపథ్యంలో ఓవల్ ఆఫీసులో ఎలాన్ మస్క్‌కు వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. శుక్రవారం (మే 30న) తన పదవికి చివరి రోజు కావడంతో అధ్యక్షుడు ట్రంప్ కార్యాలయానికి ఎలాన్ మస్క్ వెళ్లారు.